## క్లుప్తంగా

### నేడు మీ కోసం రద్దు

పుల్లలచెరువు: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగే మీ కోసం కార్యక్రమం రద్దయినట్లు తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. డీఆర్‌సీ సమావేశం ఉన్నందున సోమవారం జరిగే మీ కోసం కార్యక్రమం రద్దు చేసి అదే కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ మంగళవారం కలెక్టర్ కార్యాయలంలో నిర్వహించేందుకు అధికారులు మార్పు చేశారని, మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఈ విషయం గమనించాలని తహశీల్దార్ తెలిపారు.

### 13న పొదిలిలో విద్యుత్ అదాలత్

పొదిలి రూరల్: స్థానిక మంజునాథ కల్యాణ మండపంలో ఈ నెల 13వ తేదీన విద్యుత్ సమస్యలపై విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏడీఈ డి.హరిబాబు తెలిపారు. కన్జ్యూమర్స్ గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ జస్టిస్ విక్టర్ ఇమ్మానియల్, ఫోరం సభ్యులు ఒంగోలు ఆపరేషన్స్ ఎస్‌ఈ కె.వెంకటేశ్వర్లు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని దర్శి డివిజన్ పరిధిలోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు మండలాల వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

### నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లిలో వెలిసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు యక్కలి బాలవెంకటేశ్వర్లు తెలిపారు. 12వ తేదీ సాయంత్రం అంకురార్పణం, ధ్వజారోహణం, రాత్రి భేరీ పూజ దేవతాహ్వానం, రాయబారం, ఎదురుకోల, తెల్లవారుజామున స్వామి వారి కల్యాణం అన్నమరాజు, యక్కలి వంశీయులతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. 13న ఉదయం సూర్య వాహనం, రాత్రి సింహవాహనం, 14న ఉదయ చంద్రవాహనం, రాత్రి శేషవాహనం, 15న రాత్రి హనుమంత వాహనం, 16న రాత్రి గరుడ వాహనం, 17న రాత్రి గజ వాహనం, 18న సాయంత్రం రథోత్సవం, 19న రాత్రి అశ్వ వాహనం, 20న ఉదయం పూర్ణాహుతి, రాత్రి హంస వాహనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

### నేటి నుంచి చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలంలోని దూపాడులో వెలిసిన గంగా భ్రమరాంబ సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తలు అయితా వెంకటేశ్వర్లు, సునీల్ కుమార్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, ప్రసాదరావు, సురేష్‌బాబు తెలిపారు. 12వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు నవగ్రహ మండపారాధన, అంకురారోహణ, బలిహరణ, రాత్రి నెమలి వాహనం, 13న ఉదయం అభిషేకం, నిత్య హోమం, స్వామివారి కల్యాణ మహోత్సవం, శేషవాహనం, రాత్రి అశ్వవాహనం, 14న రాత్రి నంది సేవ, 15న రాత్రి గజవాహనం, 16న సాయంత్రం రథోత్సవం, 17న ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి, అపబృథ స్నానం(చండీశ్వర), రాత్రి ఊరేగింపు, దొంగల దోపు, కంకణ విమోచనం కార్యక్రమాలతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

### గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటిగంగమ్మ తల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని పూజారులు మెట్టేల బాలరాజు, పి.విజయలక్ష్మి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, కానుకలు సమర్పించి, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాల్లోని పుట్ట, నాగశిలలు, మల్లికార్జున స్వామికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

# రైతులూ..విత్తనాలపై జాగ్రత్త

- గ్రామాల్లో జోరుగా విత్తనాలపై ప్రచారం
- విత్తనాలు కొనేముందు రైతులు అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయాధికారులు సూచన



పత్తి పంట సాగు చేయడానికి సిద్ధం చేస్తున్న పొలం

పుల్లలచెరువు: ఇటీవల నియోజకవర్గంలోని పలు మండలాల్లో చెదురు మదురు వర్షాలు పడడంతో రైతుల పొలాలు కొంత మేరకు పదునయ్యాయి. దీంతో కొందరు రైతులు పత్తి పంట సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్‌లో రైతులను ఆకట్టుకునేందుకు పలు విత్తనాల కంపెనీలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయితే రైతులు జాగ్రత్తగా లేకపోతే నకిలీ విత్తనాలతో నష్టపోయే ప్రమాదం ఉంది. అసలు విత్తనాలతో పాటు నకిలీ విత్తనాలు కూడా రైతులకు అంటకట్టే ప్రమాదం ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో చాలా వరకు పత్తిని ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తారు. గతంలో మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలు కొని అవి నకిలీవి అని తేలినా ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వారికి నష్ట పరిహారం అందలేదు.

ఈ ఏడాది మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటి వరకు 16 హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు ముందుగా పొలాలను శుభ్రం చేస్తున్నారు. ఏ రకం పత్తి విత్తనం కొనాలా అని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం బీటీ పత్తి విత్తనాల్లో అనేక రకాలు వస్తున్నాయని తగిన జాగ్రత్తలు తీసుకుని విత్తనాలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు.



మార్కెట్‌లో లభిస్తున్న వివిధ కంపెనీల విత్తనాలు (ఫైల్)

**రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని..**

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు, దళారులు ఏటా విత్తనాలకు డిమాండ్ సృష్టిస్తున్నారు. తొలకరి ప్రారంభం కావడంతోనే రైతులంతా ఒకే సారి దుకాణాల వద్ద బారులు తీరుతుండటంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి, రైతులకు కొత్తరకం, నాణ్యత లేని విత్తనాలు అంటగడుతున్నారు. రైతులకు దిగుబడిరాక, పెట్టుబడులు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారు.

**విత్తనాలు కొనేటప్పుడు గమనించాల్సిన విషయాలు ఇవీ..**

- పత్తి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు వాటిని తయారు చేసిన కంపెనీ పేరు, లోగో, బ్యాచ్, లాట్ నంబర్ తయారు చేసిన తేదీ వాడటానికి గరిష్ట గడువు తప్పకుండా చూడాలి.
- నమ్మకమైన, గుర్తింపు పొందిన డీలరు నుంచే కొనుగోలు చేయాలి.
- ఐఎస్‌వో స్టిక్కర్ ఉందో లేదో గమనించాలి.
- మొలకెత్తే శాతం వివరాలు చూడాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు. గడువు దాటిన విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- విత్తనాలు కొన్న తేదీ, ధర పూర్తి వివరాలతో రసీదు పొందాలి.
- ఎటువంటి అనుమానాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

## వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ గోపుర ప్రతిష్ఠ



కళ్యాణాన్ని వీక్షించేందుకు తరలి వచ్చిన భక్తులు

- వేడుకగా భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో వెలసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయ గోపుర, కలశ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామున అధివాసపూజ, శిఖర యంత్రం, గర్త న్యాసం, యంత్రస్థాపన, కలశ స్థాపన, ఆంజనేయస్వామికి విశేష పూజలు, ఆకు పూజలు, మహా పూర్ణాహుతి, ఆలయ శిఖర కలశానికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వర్ణ, రజిత ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, ఆలయ అర్చకుల వేద మంత్రాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కమనీయ దృశ్యాలు వీక్షించేందుకు భక్తులు భారీగా బారులు తీరారు. ఆలయం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మా పద్మజాయల్లేష్ దంపతులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్ని కళ్యాణాన్ని నిర్వహించారు.



స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం


పెద్దారవీడు: మండలంలోని సానికవరంలో కోదండరామస్వామి దేవస్థానం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. పోతులూరి శివరామాచార్యస్వామి సిద్ధాంతి, సంగుభట్ల వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం గం.6.48 కు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మంగళ వాయిద్యాల నడుమ ప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవాచన, ప్రసాద వాస్తు పూజ, గర్తన్యాస, ధాతున్యాస, బీజ న్యాసనం, సుమహూర్త యంత్రస్థాపనలు, శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠలు, కళాన్యాసం, ధేనుదర్పణ దర్శనం, మహా కుంభాభిషేకం, శాంతి కళ్యాణం, సర్వదర్శనం, మహా పూర్ణాహూతి, సర్వశాంతి మంత్రాలు, మహదాశీర్వచనాలు, తదితర పూజలు అర్చకులు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.



సానికవరంలో ధ్వజస్తంభానికి కార కర్పూరం సమర్పిస్తున్న భక్తులు

### విద్యుత్ స్తంభాల ఏర్పాటు

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలుల బీభత్సానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇండ్లచెరువులో అంధకారం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం విద్యుత్ ఏఈ షేక్ నాగూర్‌వలి తమ సిబ్బందితో స్తంభాలు ఏర్పాటు చేయించి తీగలు సరిచేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



విద్యుత్ తీగలు సరిచేస్తున్న సిబ్బంది

# ఆలయాల్లో భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ, వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నాగాంజనేయస్వామి పుట్టలో పాలు పోసి పండ్లు పెట్టారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగళ్లు చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు సమర్పించారు.



పెద్దారవీడులో ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ దేవత

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న రఫీ

గిద్దలూరు రూరల్: ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గిద్దలూరు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేయాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి నాలుగు లేబర్స్ కోడ్స్ తీసుకురావడం అన్యాయమన్నారు. కనీస వేతన చట్టం, పీఎఫ్, ఈఎస్‌ఐ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం లాంటి వాటిని ప్రభుత్వం రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. అందుకు నిరసనగా ప్రతి కార్మికుడు సార్వత్రిక సమ్మెకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, థామస్, నూర్జహాన్, రూతమ్మ, సమీరా, ఎం.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకం

పొదిలి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అరాచకం సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి విమర్శించారు.ఆదివారం పొదిలిలో ఆయన మాట్లాడుతూ.. చిలకలూరిపేటలో మాజీ మంత్రి, బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ అయిన విడుదల రజనిపై స్థానిక సీఐ సుబ్బనాయుడు, పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు అత్యంత దారుణమన్నారు. మాజీ మంత్రి, మహిళ అనే గౌరవం లేకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని అన్నారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేయడమే కాకుండా, హామీలను ప్రశ్నించే వారిపై పోలీసులను ప్రయోగిస్తూ అక్రమ కేసులు బనాయించడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కూటమి నేతలకు పరిపాటిగా మారిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ అన్నింటికీ సిద్ధంగా ఉందని, కూటమి దురాగతాలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మానుకుని ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు.

## 14 నుంచి ప్రసన్నాంజనేయ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు



ప్రతిష్ఠ ఉత్సవాలకు ముస్తాబైన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

దొనకొండ: మండలంలోని పడమట వెంకటాపురం పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు రెంటచింతల సత్యనారాయణ శర్మ తెలిపారు. బద్వేలుకు చెందిన బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామశాస్త్రి ప్రతిష్ఠ పూజలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. 16వ తేదీ ప్రతిష్ఠ హోమం, శాంతి పౌష్టిక హోమాలు, గోపుర శిఖర కలశ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, ధ్వజ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

## తిరునాళ్ల ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

- ఎస్సై కమలాకర్

ముండ్లమూరు(కురిచేడు): మండలంలోని మారెళ్ల గ్రామంలో అంకమ్మ తల్లి తిరునాళ్లను గ్రామ ప్రజలందరూ కలిసి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై కమలాకర్ సూచించారు. ఆదివారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మారెళ్ల గ్రామాన్ని సందర్శించి గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి భేషజాలకు పోకుండా దైవ భక్తితో సంతోషంగా తిరునాళ్ల నిర్వహించుకోవాలని కోరారు. వివాదాలతో గ్రామానికి చెడ్డపేరు వస్తుందని, అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామంలో కరుణా వృద్ధాశ్రమానికి ఆదివారం ఓ దాత నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానిక యూనియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి షేక్.మజ్నూషా తన మనమడు ఆదిల్ పుట్టినరోజు సందర్భంగా సుబానీ, రహ్మతుల్లాతో కలిసి వచ్చి ఆశ్రమంలోని వృద్ధులకు 100 కిలోల బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ డైరెక్టర్ కాశయ్య, వృద్ధులు పాల్గొన్నారు.



వృద్ధులకు సరుకులు అందజేస్తున్న మజ్నూషా, కుటుంబ సభ్యులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కంభం: స్థానిక రంగరాజు ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులందరూ ఆత్మీయంగా పలకరించుకుని, పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించిన నాటి విద్యార్థులను గురువులు అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కామిరెడ్డి రామచంద్రారెడ్డి పూర్వ విద్యార్థుల సంక్షేమ నిధికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బైసాని రామకృష్ణ, ఎంఈఓ ఎ.మల్లికార్జున తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరాజు, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగసుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఇబ్రహీం, మనోరంజని, గురుమూర్తి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



కంభం రంగరాజు స్కూల్లో గురువులతో పూర్వ విద్యార్థులు



తర్లుపాడులో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

**ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు కె.గోపాలకృష్ణమూర్తి, జె.కృష్ణమూర్తి, ఎన్‌సీ కృష్ణారెడ్డి, అనివిలాసిని, వెంకటయ్య, షేక్ ఖాశీం వలి, పఠాన్, మహబూబ్‌ఖాన్, కె.పెద్దవాసును సన్మానించారు. మీ ప్రోత్సాహంతో జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగామని ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు కొనియాడారు. పాఠశాలలో కలియతిరిగి నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, చైర్మన్ రాజారాంరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.